క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



ఎమ్మెల్యేతో నూతన కమిటీ సభ్యులు

జగిత్యాలజోన్: ఇటీవల నూతనంగా ఎన్నికైన జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు, ఉపాధ్యక్షుడు సిరిపురం మహేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి అందె మారుతి, మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులు అప్రమత్తంగా ఉండాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న గోవర్ధన్

మెట్‌పల్లి: వేసవిలో పని చేసే చోట కార్మికులు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ సూచించారు. మార్కెట్ యార్డులో మంగళవారం కార్మికులకు ఆయన ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులను ఏర్పాటు చేశామని, ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, సూపర్‌వైజర్ హరికృష్ణ టపాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న నాయకులు

మల్లాపూర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ మంజూరు చేయించిన లక్షలాది నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని కొత్తదాంరాజుపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు అధ్యక్షుడు ఏలేటి మహేశ్ రెడ్డి అన్నారు. మల్లాపూర్ మండలంలోని కొత్త దాంరాజుపల్లిలో మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాటిపెల్లి ఆదిరెడ్డితో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులు పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలపై వివక్ష చూపుతోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వినోద్, లక్ష్మారెడ్డి, నవీన్, శంకర్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

మెట్‌పల్లిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెట్లచిట్టాపూర్ పీఏసీఎస్ చైర్మన్ కేశిరెడ్డి నవీన్ రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం విట్టంపేట,కేసీఆర్ తండా,జగ్గాసాగర్,ఆత్మకూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతామన్నారు.

బీజేపీ పటిష్టత కోసం కార్యకర్తలు కృషి చేయాలి

రాయికల్: బీజేపీ పటిష్టత కోసం కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాబోయే బల్దియా ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపాలని, దీని కోసం కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు మచ్చ నారాయణ, కుర్మ మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్‌తో రాయితీ

- చెల్లింపుదారులకు ప్రయోజనం
- ఈనెల 30వ తేదీ వరకు గడువు
- సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న అధికారులు

రాయికల్: బల్దియాలో నిర్వహణ ఖర్చులకు అవసరమైన సాధారణ నిధుల సమీకరణకు ఎర్లీబర్డ్ పథకంపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది విస్తృత ప్రచారం కల్పిస్తూ ఆస్తిపన్ను రాబట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బల్దియాలోని వర్తక పన్ను, దుకాణాల అద్దె తదితర వాటితో పోల్చుకుంటే ఆస్తిపన్ను చాలా కీలకం. దీనిని ముందస్తుగా వసూలు చేయడంతో మున్సిపాలిటీకి ఆదాయంతో పాటు, పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ లభిస్తోంది. ఈనెల 30 వ తేదీలోపు ఎర్లీబర్డ్ స్కీంపై ప్రభుత్వం గడువు విధించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నివాస, నివాసేతర ఆస్తులపై ఎలాంటి బకాయిలు లేకుండా పన్ను చెల్లించిన వారు ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీబర్డ్ పథకానికి అర్హులు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే దృష్టి సారిస్తే తప్ప పూర్తిస్థాయిలో పన్ను వసూలు సాధ్యం కాదు. దీంతో పట్టణ ప్రజలకు ఎర్లీబర్డ్ స్కీం ద్వారా ఒకేసారి పన్ను చెల్లిస్తే రాయితీ ప్రయోజనం పొందే అవకాశం ఉంది. దీని కోసం మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పట్టణంలోని ప్రతి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు.



రాయికల్‌లో పన్ను చెల్లిస్తున్న గృహిణి

అభివృద్ధికి సహకరించాలి



రాయికల్ బల్దియా ప్రజలు ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి. ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చు. ఈనెల 30వ తేదీలోపు చివరి తేదీ. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

తాగు నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల: ఎండలు ముదురుతున్నందునా నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు మున్సిపాలిటీల్లోని 59 వార్డుల్లో నీటి సమస్యలు రాకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడారు. వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయో ముందే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్లు మారుతీ ప్రసాద్, మోహన్, డీఈలు, ఏఈలు, మిషన్ భగీరథ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆవిర్భావసభకు భారీగా తరలిరావాలి

కోరుట్ల రూరల్: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని యూసుఫ్‌నగర్ లో బహిరంగ సభకు వాల్ రైటింగ్‌ను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

మెట్‌పల్లి: సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్‌కు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఇబ్రహీంపట్నం బీజేపీ నాయకుడు యరగొర్ల బాలచిన్నయ్యతో పాటు పలువురు నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, నాయకులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, గూడ శ్రీకాంత్‌రెడ్డి, కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని అమ్మక్కపేట నుంచి డబ్బా వరకు జై బాపు , జై భీమ్ , జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు క్యాతం తిరుపతిరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న నర్సింగరావు

విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు వృత్తి నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాలలో టాటా కమ్యూనిటీ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు బీఎఫ్ఎస్ఐపై ఓరియెంటెడ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు టాటా వారు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. టాటా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తూ శిక్షణ సైతం ఇస్తున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌ప్రతినిధి రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కెరీర్ ప్లేస్‌మెంట్‌లో అవసరమైన సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టాస్క్ కెరీర్ గైడెన్స్ ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి జి.నీరజ, అధ్యాపకులు వరప్రసాద్, రాంచంద్రం, వాసవి పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

సారంగాపూర్: వేసవి తీవ్రత పెరుగుతున్నందునా గ్రామాల్లో తాగునీరు, నీటి ఎద్దడి రాకుండా పంచాయతీ కార్యదర్శులు చూడాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో వట్టిపోయిన హ్యాండ్ బోరు పంపులు ఉంటే వాటికి మరమ్మతు చేసి నీరందించాలన్నారు. రక్షిత మంచినీటి బావుల వద నుండి నీటి సరఫరాను పర్యవేక్షించాలని కోరారు. నర్సరీల్లో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉపాధిహామీ కూలీలు ఉదయం 11 గంటల లోపు పనులు ముగించే విధంగా చూడాలని, గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై సమీక్షించారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో శ్రీలత, టీఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాయికల్/కథలాపూర్/మల్లాపూర్/గొల్లపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నారు. రాయికల్, కథలాపూర్, గొల్లపలి, మల్లాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఎత్తును, గర్భిణులు, బాలింతల బరువులు చూడటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కథలాపూర్ మండలంలోని చింతకుంట అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు ఆరోగ్యసూత్రాలతో పాటు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, హైమాది బేగం,శంకరమ్మ, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి సురేంద్రకుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

నృసింహుని సన్నిధిలో విప్ పూజలు



పూజలు చేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన, అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకున్నారు. చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, ఆలయ అర్చకులు తదితరులున్నారు.

పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలు అర్థరహితం

జగిత్యాలటౌన్: ప్రధాని మోదీపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ వ్యాఖ్యలు అర్థరహితమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో మాట్లాడారు. సెక్యులర్ పేరుతో దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ అధికారంలో ఉండటం చూడలేక చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు అడ్డగోలు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసులు మంగళవారం సైబర్ నేరాలపై 8, 9వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫోన్లలో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో ఆదాయం వస్తుందని వచ్చే ప్రకటనలు చేసి మోసపోవద్దని, పూర్తిగా ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేస్తున్న విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ రేట్లు రెట్టింపు చేయాలి

జగిత్యాల: ఎస్సెస్సీ పరీక్ష పత్రాల మూల్యాంకన భత్యం, సిబ్బందికి చెల్లించే గౌరవ వేతనాన్ని రెట్టింపు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ అన్నారు. మంగళవారం డీఈవో రాముకు వినతిపత్రం అందజేశారు. జీవో నంబరు 18 ద్వారా స్పాట్ రేట్లు అమలులోకి వచ్చి ఏడేళ్లు గడుస్తున్నా ఇంత వరకు పెంచకపోవడం అశాస్త్రీయమన్నారు. స్పెషల్ అసిస్టెంట్లకు సైతం రవాణా, దినసరి భత్యం చెల్లించాలన్నారు. స్పాట్ ముగిసిన రోజునే రెమ్యూనరేషన్ నగదు పంపించాలన్నారు.

తిర్మలాపూర్,ఇబ్రహీంనగర్ గ్రామాల పేర్లు మార్పు

గొల్లపల్లి: మండలంలోని తిర్మలాపూర్,ఇబ్రహీంనగర్ గ్రామాల పేర్లను మార్చుతూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. తిర్మలాపూర్ గ్రామాన్ని మల్లన్నపేటగా, ఇబ్రహీంనగర్ గ్రామాన్ని శ్రీరాముపల్లిగా పేర్లు మార్చుతూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తహసీల్దార్,ఆయా గ్రామాల కార్యదర్శులకు లేఖలు అందాయి.

మిత్రుడి వైద్యానికి ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన కుకునూరి గంగనర్సయ్య అనే వ్యక్తికి కిడ్నీలు పనిచేయకపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అతడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న దోహఖతర్‌లో ఉంటున్న అంబారిపేట వాసులు మంగళవారం రూ. 76,700 ఆర్థికసాయం అందించారు.

నిరుపేద కుటుంబానికి దుబాయ్ వారధి చేయూత

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన పల్లికొండ లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి దుబాయ్‌లోని వారధి సంఘం చేయూతనందించారు. రూ.48,350 ఆర్థికసాయాన్ని మంగళవారం నారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు.

గోశాలకు విరాళం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో నూతనంగా నిర్మించే గోశాలకు హైదరాబాద్‌కు చెందిన యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ కొలిశెట్టి శివకుమార్ మంగళవారం రూ.50,116 విరాళం నిర్వాహకులకు అందజేశారు. గోశాలకు మరిన్ని సహాయ సహకారాలు అందిస్తానని శివకుమార్ తెలిపారు.



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలోని ఆయా వాడల నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్‌లో తీసుకువచ్చి గ్రామశివారులో కుప్పలుగా పోసి నిప్పంటిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఆ పొగ సమీపంలోని ఇళ్లలోకి వ్యాపించి ప్రజలకు శ్వాసకోస సంబంధిత సమస్యలు వస్తున్నాయని పలువురు వాపోతున్నారు. చెత్తను డంపింగ్‌యార్డుల్లో పోసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
రాజశేఖర్, ఎంపీవో, కథలాపూర్ : 9640807073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కలెక్టర్‌తో ఎమ్మెల్యే సమావేశం



కోరుట్ల: కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోరుట్ల, మెట్‌పల్లి జర్నలిస్టులకు నిర్మించిన ఇళ్లను వారికి అలాట్ చేయాలని కోరారు. అలాగే వేసవి కాలం దృష్ట్యా రెండు మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత ఎముకల బల పరీక్ష

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ముంబాయ్ హాస్పిటల్‌లో శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత ఎముకల బల పరీక్ష చేపడుతున్నట్లు ఆర్థోపెడిక్ టి.విజయ్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్లాపూర్: మొగిలిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 1 గంటల వరకు, వ్యవసాయానికి ఉదయం 9 గంటల నుంచి 1గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో టీఈ వినీత్ రెడ్డి తెలిపారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి

జగిత్యాల: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల ఉన్నతస్థానంలో నిలబడాలని, చదువే ముఖ్యమని మంచి చదువుతో ఉన్నతస్థానాల్లో ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు.



విద్యార్థినిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కరాటేతో ఆత్మస్థైర్యం

మల్యాల: కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని, ఆపదలో రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని అల్ఫోర్స్ ఎస్ఎస్‌వీ పాఠశాలలో కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, కోచ్ మర్రిపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్ల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరాటే అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్ కుమార్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బె ల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో హనుమాన్ శోభాయాత్ర మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామంలోని చెరువుకట్ట సమీపంలోని హనుమాన్ ఆలయం నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది.ఈ సందర్భంగా గ్రామంలో కోలహలం నెలకొంది. రాముడు,హనుమాన్ వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: భీమారం మండలంలోని ఈదుల లింగంపేటలో అంజన్న స్వాములు చివరి మంగళవారం పురస్కరించుకుని ఆంజనేయ స్వామిని ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పురోహితుడు మఠం మల్లికార్జున్, అంజన్న దీక్షాపరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో హనుమాన్ భక్తులు

హనుమాన్ దీక్షాపరుల అన్నదానం

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్‌లో హనుమాన్ దీక్షాపరుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన 100 మంది హనుమాన్ దీక్షాపరులు హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హనుమాన్ దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాపరులకు మంగళవారం అన్నదానం చేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన పసుల గంగవ్వ (26) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం రేకులపల్లికి చెందిన పసుల గంగవ్వను రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన తాటిపల్లి మహేందర్ అనే వ్యక్తికి ఇచ్చి రెండో వివాహం జరిపించారు. వారు బతుకుదెరువు కోసం ఇద్దరు ముంబాయి వెళ్లారు. గంగవ్వకు అక్కడ తరచూ కడుపు నొప్పి వస్తుండడంతో, తిరిగి రేకులపల్లికి చేరుకున్నారు. కడుపునొప్పి ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో పురుగుల మందు తాగింది. భర్త మహేందర్ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి పసుల లచ్చం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆస్పత్రిలో విచారణ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల ఓ ఆస్పత్రిలో ఇటీవల ఓ మహిళ మృతిచెందిన విషయం తెలిసిందే. వైద్యుల నిర్లక్ష్యమేనని మహిళ బంధువులు ఫిర్యాదు చేయగా మంగళవారం డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. ఆస్పత్రికి చెందిన వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో వివిధ ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయించుకున్న ఆరుగురికి రూ. 1,89,000 విలువ చేసే చెక్కులను మాజీ సర్పంచ్ గుడిసె జితేందర్, పూదూరి రమేశ్ మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు.

సన్న బియ్యం పథకంతో పేదలకు చేయూత

గొల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకోసం తీసుకువచ్చిన సన్న బియ్యం పథకం ఎంతో చేయూతనిస్తోందని తహసీల్దార్ వరందన్ అన్నారు. మండలంలోని గుంజపడుగులో తహసీల్దార్ సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్ పద్మావతి, కార్యదర్శి పాల్గొన్నారు.